క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



గాయాలతో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చొక్కాపు నాగభూషణరావును ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పరామర్శించారు. కొన్నిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగభూషణరావు గాయాలపాలై, మంచంపై ఉన్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయనను గురువారం కలిసి ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకుని, పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కారాడలో 'వైఎస్సార్ పొలంబడి'



తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.శ్యామసుందర్ అపరాల పంటలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పూత, పిందె సమయంలో కాయతొలుచుపురుగు, పల్లాకు తెగులు వస్తోందని వీటి నివారణకు మోనోక్రోటోఫాస్, కార్బన్డిజం అనే పొడిమందును 250 గ్రాములు, వేపనూనెను ఎకరానికి అర లీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే తెల్లదోమ, శనగపచ్చపురుగు గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సంతోషి, మాధురి, రమ్య పాల్గొన్నారు.

ఖండ్యాంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వృద్ధురాలి బీపీ పరిశీలిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు, ఏఎన్ఎం స్వాతి, సిబ్బంది కలిసి ఇంటింటికీ వెళ్లి, రోగులకు వైద్యసేవలు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



హొంజరాం గ్రామ సచివాలయ రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: మండలంలోని హొంజరాం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టికపై ఆరాతీశారు. సమయానికి విధులకు హాజరై, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆర్‌బీకే, ఆధార్ కేంద్రాలను పరిశీలించిన ఆయన సకాలంలో ప్రజలకు న్యాయం జరిగేలా సేవలందించాలన్నారు.

ప్రతిరోజూ ఉపాధి పనులను పరిశీలించాలి



ఉపాధి వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ పరిశీలించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. మండలంలోని నందిగాం గ్రామ మల్లేడు చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించిన ఆయన పనులకు హాజరైన వేతనదారుల మస్తర్లు చూసి, పలు సూచనలు చేశారు. రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని క్షేత్ర, సాంకేతిక సహాయకులకు తెలిపారు. ఆయన వెంట ఉపాధి ఏపీఓ జగదీశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి ఉన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

- వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

తెర్లాం: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. స్థానిక రామకృష్ణ థియేటర్ ఆవరణలో పార్టీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త సమన్వయంతో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఎక్కడా అవినీతి జరగకుండా పారదర్శక పాలన అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి సీఎం జగనన్నతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ తనను ఎమ్మెల్యేగా, సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. తెర్లాం మండలం వైఎస్సార్ సీపీకి కంచుకోటగా నిలుస్తోందని, అదే ఉత్సాహంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతీ సచివాలయం పరిధిలో ఒక్కో క్లస్టర్ నుంచి ఇద్దరు చొప్పున గృహ సారథులను రెండు రోజుల్లో నియమించాలని పార్టీ నాయకులను ఆదేశించారు. పార్టీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానం ఉన్న వారినే గృహ సారథులుగా నియమించాలని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో పాల్గొన్న పార్టీ బొబ్బిలి నియోజకవర్గ పరిశీలకులు, శ్రీకాకుళం డీసీసీబీ చైర్మన్ కె.రాజేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ నాయకుల సమష్టి నిర్ణయంతో క్లస్టర్ల వారీగా గృహ సారథుల నియామకం చేపట్టాలన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వారినే గృహ సారథులుగా ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, మండల పార్టీ సీనియర్ నాయకులు బి.అప్పలనాయుడు, ఎం.జగన్నాథం, టి.సత్యంనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీల వారీగా పూర్తయిన గ్రామసచివాలయ సముదాయ భవన నిర్మాణాలపై ఆరాతీశారు. పెండింగ్‌లో ఉన్న భవనాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య వల్ల నిర్మాణాలు జరగకుండా ఉంటే ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం 14వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, 15వ ఆర్థిక సంఘం నిధుల ప్రణాళికలు, పనులు అంశాలపై కొంతసేపు మాట్లాడి, పలు సూచనలు చేశారు. అలాగే మండలంలో బడ్జెట్ వివరాలు, వాటి వినియోగం, ఇతర అంశాలపై చర్చించారు. ప్రతీ సోమవారం అన్ని సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించాలని, కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు వేసవికాలం దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, రాజాం ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పీఆర్‌డీఈఈ యు.జయప్రకాష్, పీఆర్ జేఈ ప్రభాకరరావు, ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూములపై ఎస్‌డీసీ దర్యాప్తు



ఇనాం భూముల గురించి తెర్లాం తహసీల్దారు కార్యాలయంలో విజరాంపురం సర్పంచ్‌తో మాట్లాడుతున్న ఎస్‌డీసీ

తెర్లాం: మండలంలోని విజయరాంపురం గ్రామ ఇనాం భూములపై తోటపల్లి భూసేకరణ విభాగం బొబ్బిలి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.వెంకటేశ్వరరావు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయానికి విచ్చేసి, భూములకు సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలించారు. గ్రామంలో 43 ఎకరాలకు పైగా ఇనాం భూములు ఉన్నాయని, గతంలో వాటికి పట్టాలు ఇచ్చారని, ప్రస్తుతం జరుగుతున్న భూముల రీసర్వేలో వాటిని నమోదు చేయాలని సర్పంచ్ బూరి మధుసూదనరావు, పలువురు రైతులు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఇటీవల వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ విజయరాంపురం ఇనాం భూములను, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి నివేదిక అందజేయాలని తోటపల్లి భూ సేకరణ విభాగం బొబ్బిలి ఎస్‌డీసీని ఆదేశించారు. జేసీ ఆదేశాల మేరకు ఎస్‌డీసీ స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసి, విజయరాంపురం ఇనాం భూముల రికార్డులు పరిశీలించడం గమనార్హం. దీనిలో భాగంగా సర్పంచ్‌తో పాటు పలువురు రైతుల నుంచి అవసరమైన సమాచారం సేకరించారు. దీనిపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి, జేసీకి అందజేస్తానని ఎస్‌డీసీ తెలిపారు. ఆయన వెంట మండల డిప్యూటీ తహసీల్దారు గొంగాడ సత్యనారాయణ ఉన్నారు.

నేడు పెదశిర్లాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని పెదశిర్లాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలంతా హాజరుకావాలని వారు కోరారు.

సమన్వయంతో పనిచేయాలి

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, వలంటీర్లంతా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బొబ్బిలి జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన రేజేటి ఈశ్వరరావు(విసు) ఎమ్మెల్యేను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. పార్టీ పటిష్టతకు కృషి చేసిన వారికి పార్టీలో ఎప్పుడూ సముచిత గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ రియాజ్‌ఖాన్, ఏఎంసీ డైరెక్టర్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో జూదమాడొద్దు

సంతకవిటి: మండల పరిధిలోని మామిడిపల్లి, సురవరం, మండాకురిటి గ్రామాల్లో జరుగుతున్న జాతర నేపథ్యంలో జూదం ఆడొద్దని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర సూచించారు. గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయన జాతర జరుగుతున్న తీరుపై గ్రామస్తులను ఆరాతీశారు. పేకాట, అట్టాట, అశ్లీల ప్రదర్శనలు నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ర్యాలీలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

బొబ్బిలి: వాహనదారులంతా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ నాగేశ్వరరావు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆస్పత్రి రోడ్డులో పోలీసులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు తప్పనిసరిగా లైసెన్స్‌లు ఉండాలని, అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీఓ పరిశీలన



రేజేరులో భూ హక్కు పత్రాల పంపిణీని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శేషశైలజ

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో జరుగుతున్న భూ హక్కు పత్రాల పంపిణీని బొబ్బిలి ఆర్‌డీఓ పి.శేషశైలజ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె భూముల రీసర్వే అనంతరం వచ్చిన భూ హక్కు పత్రాలు ఏ మేరకు సరిగ్గా వచ్చాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే అధికారులను సంప్రదిస్తే సరి చేస్తారని తెలిపారు. మండలంలో ఇంకా భూముల రీసర్వే జరగాల్సిన గ్రామాల్లో కూడా సర్వే త్వరితగతిన చేపట్టి, పూర్తి చేయాలని ఆర్‌డీఓ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామసచివాలయం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయానికి విధులకు హాజరవుతూ ప్రజల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో వారంలోగా పరిష్కరించాలని తెలిపారు. ఆమె వెంట తహసీల్దారు బాలమురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

90 శాతం ధాన్యం సేకరణ పూర్తి



ఎంపీడీఓ రమామణితో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలో దాదాపు 90 శాతం మేర ధాన్యం సేకరణ పూర్తయిందని ఎంపీడీఓ రమామణి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సందర్శించిన ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ధాన్యం సేకరణ, బిల్లుల చెల్లింపులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 1,212 మంది రైతుల దగ్గర నుంచి 4,891 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ఇప్పటివరకు 1,130 మంది రైతులకు రూ.8.10 కోట్ల బిల్లులు చెల్లించామన్నారు. మరో 120 మంది రైతులకు రూ.70 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పగడ్బందీగా చర్యలు తీసుకుంటోందన్నారు. రైతు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అన్నదాతలు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'చీపురుపల్లి'



ట్రోఫీతో విజేత జట్టు

వంగర: మండలంలోని కింజంగి గ్రామంలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా ఈ పోటీలకు దాదాపు 54 జట్లు హాజరయ్యాయి. సాయంత్రం చీపురుపల్లి, కుసుమూరు జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చీపురుపల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 100 పరుగులు చేసింది. అనంతరం 101 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కుసుమూరు జట్టు 10.5 ఓవర్లకు 71 పరుగులు చేసి, ఆలౌట్ అయింది. ఈ నేపథ్యంలో టోర్నీ విజేత చీపురుపల్లి జట్టుకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేశారు.

ఆత్మీయ సత్కారం



విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌తో డీఎస్సీ 98 అభ్యర్థులు

బొబ్బిలి:

బొబ్బిలి గురుకుల పాఠశాల సందర్శనకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ గురువారం వచ్చారు. ముందుగా ఆయన రైల్వే గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఆయనను డీఎస్సీ–98 అభ్యర్థులు కలిశారు. నియామకాలు వేగంగా చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం దుశ్శాలువతో సత్కారించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ప్రకాష్ మాట్లాడుతూ త్వరలోనే నియామక ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు.

20న పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం

బాడంగి: స్థానిక స్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆరంభమయ్యే ఈ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు



దేవుదల గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 25వ తేదీ వరకు ఆధార్ నమోదు, ఆధార్ వివరాల సవరణ జరుగుతుందని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు తెలిపారు. గురువారం మండలంలోని దేవుదల గ్రామ సచివాలయంలో అందిస్తున్న ఆధార్ సేవలను పరిశీలించిన ఎంపీడీఓ ఆధార్ కార్డులో ఎటువంటి మార్పులు, చేర్పులు కావాలన్నా ఆధార్ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. సిబ్బంది కూడా బాధ్యతగా పనిచేసి, ఆధార్ నమోదు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని తెలిపారు.

ఘనంగా యోగి వేమన జయంతి



బొబ్బిలి రూరల్: నారాయణప్పవలస పాఠశాలలో యోగి వేమనకు నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు



బాడంగి: వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ శంకరరావు, సిబ్బంది

బొబ్బిలి రూరల్: మండలంలోని నారాయణప్పవలస, అలజంగి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో యోగి వేమన జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేమన జీవిత చరిత్రతో పాటు ఆయన పద్యాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసిన తీరును వివరించారు. వేమన తన శతక పద్యాల ద్వారా సామాజిక చైతన్యం నెలకొల్పారని తెలిపారు.

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగి వేమన జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, విద్యార్థులంతా కలిసి, వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ వి.శంకరరావు ప్రజాకవి, యోగి వేమన కొన్ని పద్యాల్లోని నీతిని వివరించి, ఆయన సమాజాన్ని తన పద్యాల ద్వారా బాగు చేసిన విధానం ప్రశంసించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవికిరణ్ మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లవద్దన్నారు. మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయండి

రేగిడి: కొలతల ప్రకారం ఉపాధి పనులు చేసుకుంటే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకంపేట గ్రామపంచాయతీలో ఉన్న బారికవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు రావాలని, ఒకరి జాబ్‌కార్డుపై వేరొకరు పనులకు రావొద్దన్నారు. పనులు చేసేటప్పుడు ప్రమాదానికి గురైతే జాబ్‌కార్డు ఉన్న వారికి మాత్రమే సదుపాయాలు లభిస్తాయన్నారు.

ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి

బాడంగి: రబీ సాగు చేస్తున్న రైతులంతా పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.శిరీష సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ–క్రాప్ చేయించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం మండలంలో ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు లక్ష్యం 10 వేల మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటివరకు 7,714 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

ప్రైవేటీకరణ నిర్ణయం మానుకోవాలి

రాజాం: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలనుకుంటున్న నిర్ణయం మానుకోవాలని ఎల్‌ఐసీ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద జీవితీ బీమా జాతీయీకరణ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీని బలోపేతం చేయాలని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని ఎల్‌ఐసీ ఉద్యోగులు నినాదాలు చేశారు. అలాగే ఎల్‌ఐసీలో జీఎస్‌టీని తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఎంప్లాయిమెంట్ యూనియన్ ప్రెసిడెంట్ పి.ప్రభాకరరావు, కార్యదర్శి ఎం.తిరుపతిరావు, ఎల్‌ఐసీ క్లాస్–1 యూనియన్ నాయకులు పి.పద్మావతి, ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ యూనియన్ నాయకులు జి.గణనాథ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1996–97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారంతా ఆనాటి తీపి జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకుని ఆనందించారు. విందు భోజనం చేస్తూ ఆటపాటలతో సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి, గురువుల పట్ల వారికున్న గౌరవభావం చాటుకున్నారు.

రుచి, శుచితో కూడిన భోజనం అందించండి



రేగిడి: విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు



వంగర: మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు



తెర్లాం: కూనాయవలసలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచి, శుచితో కూడిన భోజనం అందించండి అని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. గురువారం మండలంలోని రేగిడి, ఆమదాలవలస, సంకిలి గ్రామ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని సిబ్బందికి సూచించారు. వేడివేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డించాలన్నారు. వంట నిర్వాహకులు కూడా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు మరడాన రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు..

వంగర: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. గురువారం మండలంలోని ఎం.సీతారాంపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల విద్యాప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం రుచి, శుచిలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

మెనూ ప్రకారం భోజనాలు..

తెర్లాం: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని ఎంఈఓ త్రినాథరావు సూచించారు. మండలంలోని కూనాయవలస యూపీ స్కూల్‌లో అమలుచేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని గురువారం పరిశీలించిన ఆయన మెనూ ప్రకారం వంటకాలు చేశారా లేదా అనే విషయం గమనించారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.